# మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలి



జగిత్యాల: అంబారిపేట వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులతో జడ్పీ చైర్పర్సన్ దావ వసంత

- జడ్పీచైర్పర్సన్ దావ వసంత
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పాల్గొన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



ధర్మపురి: లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల, డిసెంబర్ 9 : కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర సాధకుడు, బంగారు తెలంగాణ స్వాప్నికుడు కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రార్థించినట్లు జడ్పీ చైర్పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని కోరుతూ జగిత్యాల అర్బన్, రూరల్ మండలం, పట్టణ బీఆర్ఎస్ నాయకులతో కలిసి జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట్లోని శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం కాంగ్రెస్కు ఇచ్చినప్పటికీ తెలంగాణ ప్రజలు కేసీఆర్ మీద ఉన్న నమ్మకంతో 39 మంది ఎమ్మెల్యేలను గెలిపించి ప్రతిపక్ష హోదాలో పెద్ద బాధ్యతలు ఉంచారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ సేవలు చాలా అవసరమని, పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా కొనసాగిన అనుభవంతో అటు ప్రభుత్వానికి ఇటు ప్రతిపక్ష హోదాలో ప్రజలకు మార్గదర్శనం చేసి తెలంగాణ అభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మహేశ్, అర్బన్ ఎంపీపీ ములాసపు లక్ష్మి, ప్యాక్స్ చైర్మన్లు మహిపాల్ రెడ్డి, సందీప్ రావు, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, రూరల్ మండలాధ్యక్షుడు బాలముకుందం, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

**రాయికల్లో..**

రాయికల్, డిసెంబర్ 9 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని, జగిత్యాల ఎమ్మెల్యేగా డాక్టర్ సంజయ్కుమార్ రెండోసారి గెలుపొందడంపై కొత్తపేట శ్రీ రాజరాజేశ్వర నాగాలయంలో ఎంపీపీ సంధ్యారాణి –సురేందర్ నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని రాజేశం, ఎంపీటీసీ మందుల శ్రీనివాస్, ఆలయ చైర్మన్ ధనకంటి ప్రవీణ్, నాయకులు చిన్న నర్సయ్య, సర్వొద్దీన్ పాల్గొన్నారు.

**సారంగాపూర్లో..**

సారంగాపూర్, డిసెంబర్ 9: మండలంలోని ప్రముఖ శైవ పుణ్యక్షేత్రం పెంబట్ల శ్రీదుబ్బ రాజేశ్వరస్వామి ఆలయంలో మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేడిపెల్లి మనోహర్రెడ్డి, వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుర్రాల రాజేందర్రెడ్డి, ప్రధాన కార్యదర్శి తోడేటి శేఖర్గౌడ్, ఉపాధ్యక్షుడు తేలు రాజు, నాయకులు రమణారావు, గురునాథం మల్లారెడ్డి, మర్రిపెల్లి రాజేశం ఉన్నారు.

**ధర్మపురిలో..**

ధర్మపురి, డిసెంబర్ 9: బీఆర్ఎస్ అధినేత, మాజీ కేసీఆర్ త్వరగా కోలుకోవాలని కోరుతూ శనివారం ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల క్రితం కేసీఆర్ ప్రమాదవశాత్తు కిందపడి కాలితుంటి ఎముకకు గాయమవగా హైదరాబాద్ యశోద దవాఖానలో శస్త్రచికిత్స నిర్వహించిన విషయం విదితమే. దీంతో కేసీఆర్ కోలుకోవాలని కోరుతూ స్వామివారి సన్నిధిలో పూజలు చేశారు. ఇక్కడ డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్కుమార్, దేవస్థానం రెనోవేషన్ కమిటీ సభ్యులు స్తంబంకాడి మహేశ్, చుక్క రవి, నాయకులు ఇనుగంటి వెంకటేశ్వరరావ్, అనంతుల లక్ష్మణ్, చీర్నేని నర్సయ్య, గడ్డం బాలరాజు ఉన్నారు.





రాయికల్ : కొత్తపేట ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ సంధ్యారాణి, నాయకులు, సారంగాపూర్: పెంబట్ల దుబ్బ రాజేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నేతలు

## కోరుట్లలో స్వచ్ఛ టాయిలెట్ క్యాంపెయిన్

కోరుట్ల, డిసెంబర్ 9: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ 25 వరకు నిర్వహించే క్లీన్ టాయిలెట్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని పట్టణంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాభవానీ మహిళా పొదుపు సంఘానికి చెందిన మహిళలు పబ్లిక్ టాయిలెట్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి, ముగ్గులతో అలంకరించారు. కోరుట్ల పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు పబ్లిక్ టాయిలెట్లను ఉపయోగించుకుని పట్టణాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన లేని పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు మహేశ్, ప్రవీణ్, రమేశ్, పొదుపు సంఘం మహిళలు పాల్గొన్నారు.



కోరుట్లలో పబ్లిక్ టాయిలెట్ ఎదుట ముగ్గులు వేసిన పొదుపు సంఘం మహిళలు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలి



మాట్లాడుతున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

- ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొడిమ్యాల, డిసెంబర్ 9 : రాబోయే స్థానిక సంస్థలు , ఎంపీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సూచించారు. శనివారం నాచుపల్లి గ్రామంలో కొడిమ్యాల, మల్యాల మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడిన పనిచేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగుర వేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రెండు మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పునుగోటి కృష్ణారావు, మిట్టపల్లి సుదర్శన్, సింగిల్ విండో చైర్మన్లు మేన్నేని రాజనర్సింగారావు, అయిల్నేని సాగర్రావు, బోయిన్పల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న దివ్యాంగుల సంఘం నాయకులు

జగిత్యాల రూరల్, డిసెంబర్ 9: ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన విధంగా దివ్యాంగులకు ఉచిత బస్ ప్రయాణం, రూ.6వేలు పింఛన్ ఇవ్వకపోవడం దివ్యాంగులను విస్మరించడమేనని ఆ సంఘం నాయకులు విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దివ్యాంగురాలికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం ఇవ్వడం బాధాకరమన్నారు. మహిళలకు ఎలాగైతే ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారో అలాగే దివ్యాంగులకు సైతం రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏ పథకం చేపట్టినా 5శాతం తగ్గకుండా దివ్యాంగులకు కేటాయించాలని కోరారు. ఇక్కడ దివ్యాంగుల సంఘం నాయకులు లంకదాసరి శ్రీనివాస్, బండి సత్యనారాయణ, మహ్మద్ అజ్గర్ఖాన్, మాసం నర్సయ్య, గొల్లపెల్లి శ్రీధర్, చంద్రశేఖర్, లచ్చయ్య, గురువయ్య, రాజు పాల్గొన్నారు.

## ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

కొడిమ్యాల, డిసెంబర్ 9 : మండల కేంద్రంలో నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీవేంకటేశ్వర ఆలయానికి మండల కేంద్రానికి చెందిన రాచర్ల శ్రీనివాస్–స్వరూపారాణి దంపతులు ఆలయ శాశ్వత చందాదారులుగా రూ.50,116 విరాళంగా శనివారం ఆలయ పూజారి నాగరాజు రమేశ్కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత

మల్యాల, డిసెంబర్ 9 : తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన నిరుపేద దూల హన్మయ్యకు రెండు కిడ్నీలు చెడిపోవడంతో వైద్య ఖర్చుల నిమిత్తం మల్యాలకు చెందిన సామాజిక సేవకులు గుండేటి రవితేజ, సంతోష్ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే కుటుంబానికి అవసరమైన నిత్యావసర సరుకులతో పాటూ 25 కిలోల బియ్యాన్ని విరాళంగా అందజేశారు. ఇక్కడ ముత్యం శంకర్, పొన్నం సాయి, ఉంగరాల గణేశ్, చందు, మని, రాఘవేంద్ర, రాజు, నవీన్, మహేశ్, భరత్ ఉన్నారు.

## గోపా నాయకుల సంతాపం

రాయికల్, డిసెంబర్ 9 : రాయికల్ పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు ముంజ ధర్మపురి ఇటీవల గుండపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. శనివారం గోపా మండల శాఖ ఆధ్వర్యంలో సంతాపం తెలిపి, బాధిత కుటుంబానికి రూ 5 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బత్తిని నిరంజన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పోతుగంటి సురేశ్గౌడ్, కోశాధికారి గుగ్గిళ్ల రాముగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నం రమేశ్గౌడ్, మోసరపు శ్రీధర్, రాజేందర్, సాగర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేచపల్లికి ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ

సారంగాపూర్, డిసెంబర్ 9: రేచపల్లికి ఆర్టీసీ బస్సు సేవలు కొంత కాలంగా నిలిచిపోయాయి. ఎమ్మెల్సీ జీవన్రెడ్డి ఆర్టీసీ ఆర్ఎంకు సమస్యను వివరిస్తూ లేఖ రాయడంతో స్పందించిన అధికారులు శనివారం బస్సును ప్రారంభించారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ బస్సును పూలదండలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్సు ప్రారంభోత్సవంలో అధికారులు, గ్రామస్తులు